

# అందమైన తల్లి

మధవపెద్ది పుణ్యశీల ప్రసాద్

సంధ్యా సమయం. చల్లని గాలి.

పచ్చని చెట్లూ. తెల్లని కొండలు.

కొండల అంచుల్ని ముద్దుపెట్టుకుంటూ — మెల్లి మెల్లిగా పయనిస్తున్న తెల్లని అందమైన మేఘాలు.

సూర్యుడింకా అస్తమించకుండానే— చంద్రుడు తొందరపడి వచ్చేశాడు.

ఎంత ప్రశాంత వాతావరణం!

లలిత ఆరుబయట కుర్చీ వేసుకుని కూర్చుని ప్రకృతి అందాల్ని అవలోకిస్తోంది.

పంచుకోడానికి ఎవరూ లేరు. చిన్నగా నవ్వుకుంది.

తనకే కవిత్వం వస్తే? ఎంత బావుండును! తన ఊహల్ని కథా రూపంలో పెట్టగలిగితే ?

అంత అదృష్టమా?

నీలాకాశంలోని తెల్లని మేఘాలు— మేమూ కురిపించగలం వాన అన్నట్టు— చిన్న చిన్న చినుకుల్ని రాల్చడం మొదలు పెట్టాయి.

వానలో తడవడం లలితకి ఎంతో ఇష్టం.

ఇట్లాంటి వాతావరణంలో గొంతెత్తి పాడుకోవడం ఇంకా ఇష్టం.

ఇంత చక్కటి వాతావరణంలో ఎందుకో ఎందుకో మరి లలిత మనసు మాత్రం దిగులుగా వుంది. విచారంగా వుంది.

ఎందుకు? తనని తనే ప్రశ్నించుకుంది.

ఏం తక్కువ? అందమైన భర్త వున్నాడు. తనని ఎంతో ప్రేమిస్తాడు. ఏం కావాలన్నా ఇస్తాడు. బాగా చదువుకున్నవాడు. మంచి హోదాలో వున్నవాడు.

మంచి మంచి చీరలెన్నో వున్నాయి, అలంకరించుకోడానికి ఎన్నో సామగ్రులున్నాయి. రేడియో - ఫాను-పుస్తకాలూ అన్నీ వున్నాయి.

మంచి ఇల్లూ- తోటా- అన్నీ అన్నీ వున్నాయి.

అయినా అయినా ఏదో వెలితి. ఆడదానికి ఇంతేనా కావలిసింది?

అవును. ఇంకా ఏం కావాలి?

ఎందుకో అకస్మాత్తుగా ఇందాక జరిగిన సంఘటన గుర్తుకి వచ్చింది.

సాయంత్రం నాలుగు గంటలు— అప్పుడు.

భర్త ఇంట్లోనేవున్నా ఆఫీసు పనిలో నిమగ్నమయి వున్నాడు. భర్తనే చూస్తూ కూచుంది కాసేపు-తను! నిజంగా చాలా అందమైనవాడు - అతను. ఉంగరాల జుట్టూ. అందమైన కనుముక్కు తీరూ. ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది ముఖం. ఆరడుగుల ఎత్తూ-పచ్చని శరీర ఛాయా. అందంగా డ్రెస్ చేసుకుంటాడు. అతడి అందానికి తనకి ఒక్కొక్కప్పుడు చాలా గర్వంగా వుంటుంది.

లేచి టీకి నీళ్లు పడేసివచ్చింది— కాసేపటికి.

తను వచ్చేటప్పటికి—

ఇటు తిరిగి రెప్పవాల్చకుండా తననే చూస్తున్నాడు-భర్త.

"ఏమిటట్లా చూస్తున్నారు?" ప్రశ్నించింది.

"చీర చాలా బావుంది లతా!" అన్నాడతను.

తను కట్టుకున్న చీరవైపు చూసుకుంది. తెల్లని జరీఅంచు చీరె అది!

నిజమే-చాలా బావుందా చీర.

కాని - కాని బావుంది చీర మాత్రమేనా. ? అనుకుంది.

తనలో తను.

పైకి నవ్వి వూరుకుంది.

ఇట్లాంటి సంఘటనలు ఎన్నెన్నో!

ఏకాంతంగా అందమైన సాయం సమయాన ప్రకృతి సౌందర్యాలను చూస్తూ గతాన్ని గురించి ఆలోచించ సాగింది లలిత.

* * *

"అబ్బ రేఖా ఎంత బావున్నావే-ఈ చీరలో—" కాలేజీ మేట్సంతా తన చెల్లెలు రేఖని పొగుడుతుంటే - తను కట్టుకున్న చీరవైపు చూసుకుంది లలిత.

సరిగ్గా రేఖ కట్టుకున్నలాంటిదే—

ఎఱ్ఱని రంగుకి- తెల్ల బార్డరున్న చీరె- ఎఱ్ఱని జాకెట్టు-బాక్ ఓపెన్. ఎఱ్ఱ గులాబీ పువ్వు-తల్లో! ఎఱ్ఱని గాజులు ఒక చేతికి. రెండో చేతికి వాచీ-

సరిగ్గా- రేఖా-తనూ-ఒక డ్రస్సే.

ఒకే అలంకరణ.

తనని ఎవ్వరూ బావున్నావని అనలేదు-కనీసం-

పెద్ద అందమైంది కాదు లలిత.

అట్లాగని అనాకారీ కాదు.

అయినా పదిమందిలో గుర్తించ దగ్గట్టుగా వుండదు. కాలేజీ నించి వచ్చాక అంది అమ్మతో లలిత-

"అందరూ దీన్ని మెచ్చుకునేవాళ్లే

కాలేజీలో-కనీసం నా ముఖం చూసిన వాళ్లుకూడా లేరు-"

అట్లా అంటున్నప్పుడు ఎందుకో ఎంత వద్దన్నా కళ్లనీళ్లు తిరిగాయి.

తల్లి మనసు కరిగింది.

"ఛీ- ఛీ- ఏడుస్తారటే ఎక్కడన్నా? చూడూ వాళ్లు బావున్నావని అనక పోతేనేం? రేపు నీ మొగుడు నిన్ను మెచ్చుకోడూ? నీ మొగుడు కళ్లకి నువ్వు రంభలాగా కనిపిస్తావు. అప్పుడు వద్దన్నా- అస్తమానూ నిన్నూ - నీ అందాన్నీ మెచ్చుకుంటాడు. మొహం మొత్తేట్టు-"

"ఫో-అమ్మా-" అప్పుడు భలే కోపం వచ్చినా-తరువాత సిగ్గుపడ్డది.

ఆ తరువాత సంతోషపడ్డది.

ఆ తరువాత ఆమాట తలుచుకొని-తలచుకొని- మురిసిపోయింది.

ఆ తరువాతంతా తనను ఎవరూ మెచ్చుకోకపోయినా.

తన బంగారు కలల్లోని రాజకుమారుడితో-తన జీవితం తల్చుకుంటూ గడిపింది.

ఎవరూ తనని మెచ్చుకోలేదని అనుకునేదేకాదు. అసలు లెక్కచేసేదే కాదు.

జడేసుకుంటూ- ముందుకు వచ్చిన ముంగరులను చూసి-

తన పతి ఎంత పరవశిస్తాడో అనుకునేది.

తిలకం దిద్దుకుంటూ-అందులోనే తన భర్త వున్నాడని అనుకునేది.

కళ్లకి కాటుక నొసలు దిద్దుకుంటూ-తన కాటుకకళ్లని తన కాంతుడు ఎంత వర్ణిస్తాడో-అనుకునేది.

తను నవ్వినప్పుడు - తన నాథుడు ఎలా వర్ణిస్తాడో అనుకునేది.

నడిచినప్పుడు- తన వయ్యారాన్ని ఎంత ఆరాధిస్తాడో అనుకునేది.

తను చేసే ప్రతి పనీ-తను పలికిన ప్రతి పలుకూ-తను నవ్విన ప్రతి నవ్వూ-తను నడిచిన ప్రతి నడకా-తను చూసిన ప్రతి చూపూ-

తన భర్తని ఎంత మెప్పిస్తాయో-ఎంత అలరిస్తాయో అని పదేపదే అనుకుని సంతోషించేది.

ఎన్నోసార్లు - ఎన్నో - మరెన్నో-బంగారు కలలు వచ్చాయి లలితకి.

లలిత-భర్తా షికారెళ్తున్నారు.

"అబ్బ — ఎందుకింత అందంగా వున్నావు-లతా!"

"ఎందుకా కాటుక కళ్ళని రెపరెప లాడించి నన్ను వేధిస్తావు?"

"ఈ చీరెలో నువ్వెంత అందంగా వున్నావు?"

"ఏదీ ఒక్కసారి నవ్వవూ? నీ నవ్వులో ముత్యాలు రాల్తాయిటగా-ఏదీ చూడనీ!"

"ముంగురులు సర్దుకోకు. అవే అందం-"

"ఇంత అందమైన నడక ఎక్కడ



నేర్చుకున్నావు" ఇవన్నీ భర్త అన్నట్టూ— తను పరవశించి—ముకుళించిన కలువలా అయిపోయినట్టూ ఊహించుకునేది— లలిత!

పెళ్లయింది లలితకి.

కలలు ఫలించే రోజులూ — ఊహాలు నిజమయ్యే రోజులు దగ్గర కొచ్చాయి— అని అనుకుంది.

కానీ— కానీ—

ఆ రోజులు వచ్చాయి — వెళ్లిపోయాయి.

కలలు కలలుగానే నిలిచిపోయాయి.

పెళ్లయి ఆరునెలలు గడిచిపోయాయి.

లలిత ఊహించుకున్న వాటిల్లో ఒక్క మాట కూడా—లలిత భర్త మూర్తి నోటినుండి వెలువడలేదు.

మొదట్లో గమనించలేదు లలిత.

తరువాత గమనించినా అంత పట్టించుకోలేదు.

ఆ తరువాత కొంత బెరుకు తగ్గాక

భర్తతో అనేది- "తల ఇట్లా దువ్వు కుంటే బావుందా?"

"ఆ- బానేవుంది"

"తలంటి పోసుకుంటే జుట్టు ఎట్లా వుంటుంది?"

ఇదేం ప్రశ్న - అన్నట్టు చూసి- "ఆ- బావుంటుంది-" అనేవాడు.

కాటుక నొసలు దిద్దుకుంటూండగా వచ్చేవాడు-"ఎట్లా వుంది?" అడిగేది.

"కాటుక మా నె య్య రా దూ ?" హతాశురాలై పోయేది. అందాన్ని చూసి ఆనందించడం ఈయనకి చేతకాదేమో- అనుకుంది.

అయినా తనేం అందంగా వుంది?

అంతేనా- భర్తకి కూడా తను అందంగా కనిపించదా? అనుకుంటే ఏడుపొచ్చేది.

అయినా సాధారణంగా పెళ్ళయిన కొత్తల్లో-భర్తలు భార్యల్ని అంటిపెట్టు కునే వుంటారనీ-

ఆవిణ్ణి ప్రసన్నురాల్ని చేసుకోడానికి- ఏదో విధంగా ప్రయత్నిస్తారనీ-

అందాన్ని పొగుడుతూ వుంటారనీ- విన్నది తను.

"హుఁ తనెంత పిచ్చిది-ఎన్ని కలలు గంది?

అవును. లేని అందం ఎక్కణ్ణించి వస్తుంది కొత్తగా?"

* * *

ఉలిక్కి పడింది లలిత. వాన పెద్ద దయింది.

మౌనంగా లోపలికి వచ్చి తలుపే సింది. తను వంటరిది! పెద్దగా ఏడవాలని పిస్తోంది.

ఎంతోసేపటికి తలుపు చప్పుడయింది. లేచి తలుపు తీసింది. భర్త వచ్చాడు.

లోపలి కెళ్ళిన భర్తని అనుసరించింది.

* * *

ఆదివారం-

"ఏమండీ - అట్లా తిరిగొద్దామండీ-" అడిగింది లలిత.

"ఓ- తప్పకుండా- ఐదున్నరకల్లా. రెడీగా వుండు, వెళ్దాం-" అన్నాడు మూర్తి.

అయిదయింది టైము.


రెడీ అయ్యాడు మూర్తి. "చూడూ- ఇప్పుడే ఓ పావుగంటలో వస్తాను. నువ్వు రెడీగా వుండు-"

సరేనంటూ తలవూపి తలుపేసు కుంది. వెనక్కి తిరిగిందో-లేదో-మళ్ళీ తలుపు చప్పుడు! వచ్చింది మూర్తి-మళ్ళీ తిరిగివచ్చాడు.

వెనకే ఇద్దరు ఆడపిల్లలు. పక్కింటి వాళ్ల పిల్లలు. పబ్లిక్ స్కూల్లో చదువు తున్నారు. మూర్తికి బాగా చనువు వాళ్లంటే. లలితకీ తెలుసు-

'హలో-' పలకరించింది లలిత. కానీ ఆ సమయంలో వాళ్ళు రావడం చికాకని పించింది.

'నువ్వు రెడీ అవు-' లలిత నుద్దేశించి




అన్నాడు మూర్తి—లోపలి కెళ్ళిపోయింది లలిత.

సరదాగా—సంతోషంగా— అనర్గళంగా మాట్లాడుకుంటున్నారు—వాళ్ళు.

వాక్ కెళ్తాం కదా—అన్న సంతోషంతో సానిరాగాలు తీస్తూ.

పెల్లి హాఫ్ వాయిలు చీరా, తెల్లని జాకెట్—ముత్యాల దండ—గాజులతో రెడీ అయింది లలిత. టైము చూసింది. అయిదున్నర దాటింది.

అలవాటు ప్రకారం—ఒక ప్లేటులో కొన్ని స్వీట్లూ—బిస్కెట్లూ పెట్టుకుని వాళ్ళున్న గదిలోకి వచ్చింది. వాళ్ళకవివి, తనూ అక్కడే ఒక కుర్చీలో కూర్చుంది.

వాళ్ళ మాటలు సాగుతూనే వున్నాయి. లలిత అనబడే ఒక వ్యక్తి అక్కడ వున్నట్లు కూడా గమనింపు లేదు—వారిలో ఏ ఒక్కరికీ!

తనూ మౌనంగానే వుండిపోయింది.

టైము ఆరున్నర! మూర్తికి అసలు షికారు సంగతి గుర్తున్నట్లే లేదు. ఎం—వాళ్ళుంటే మాత్రమేం—తను రాంగానే—'వెళ్దామా—' అని గానీ— 'కాసేపాగి వెళ్దాం—' అనిగానీ—అనొచ్చుగదా? చాలా కోపం వచ్చింది లలితకి.

వాళ్ళు వెళ్ళేప్పటికి ఏడున్నర టైమయింది. సారీ—లతా—' అన్నాడు—మూర్తి!

* * *

నిరాశగా జరిగిపోతున్న రోజులలో ఒక మెరుపు తళుక్కున మెరిసింది!

అది లలిత జీవితానికి జీవాన్ని తెచ్చింది.

లలితకి అన్నం సయించడంలేదు. లలిత చిక్కిపోతోంది! కానీ మనసులో కొండంత ఆనందం! మాతృభావన ఎంత తీయనిది!

*   *   *

"లతా"

మృదువైన పిలుపుకి కళ్లు తెరిచింది.

"బాబు నీలాగా ఎంతో అందంగా వున్నాడు లతా–"

ఏమిటి – అతనంటున్నది ఏమిటి–? "నీలాగా–?" 'నీలాగా–' అంటే ?

"తను . తను అందమైనదా ?"

నమ్మలేనట్లే చూసింది.

"అవును లతా విశాలమైన కళ్లు సన్నని పెదవులు సూదిలాంటి ముక్కు– అంతా నీ పోలికే నీ అందమంతా వాడు పోగు పోసు కున్నాడు–"

ఎంతో తమకంగా–గాఢంగా బాబుని ముద్దాడుతూ అన్నాడు మూర్తి.

తను కన్న కలలు కల్లలై పోలేదు ఊహలు అబద్ధాలు కాలేదు . .

తన భర్త సౌందర్యారాధకుడే!

తను ఏమీ ఎక్కువగా కోరుకోలేదు. తన భర్త తన అందాన్ని గుర్తించాలని– తప్ప–

అసలు ప్రతి ఆడపిల్లా–చిన్నప్పటి నించే–తను అందంగా అలంకరించు కోవాలని– ఆ అందం నలుగురూ గుర్తించాలనీ అనుకుంటుంది.

తన ఈ చిన్న కోరిక ఇన్నాళ్లకి ఇన్నేళ్లకి తీరిందా?

కృతజ్ఞతగా చూసింది భర్తవైపు.

నీరసంగా వున్న ఆ కళ్లల్లో తృప్తి.

"ఫరవాలేదు– అందమైన కూతుర్ని కాలేకపోయినా – అందమైన భార్యని కాలేకపోయినా

నేను ..నేను ఇప్పుడు అందమైన బాబుకి తల్లి నయ్యాను."

అనుకుంది లలిత ఎంతో హాయిగా. ప్రపంచాన్నే జయించినంత సంతోషం కల్గింది ఆమెకు ఆ క్షణాన!

